# టైలర్ యంగన్న

సరిగ్గా 12–42 నిమిషాలకు ఆ చుట్టుపక్కల వాళ్లంతా బాంబుప్రేలుడులాంటి శబ్దం విన్నారు. టైలర్ యంగన్న దుకాణం వేపు చాలామంది పరిగెత్తారు. బయట ఉన్న కుట్టు మిషన్ దొర్లిపోయి ఉంది. లోపలి చిన్న గది కిటికీ తలుపులు తునాతునకలయాయి. సగం కుట్టిన, కుట్టాల్సిన చాలా బట్టలు పీలికలయిపోయాయి. అంతకుమించి – ఆ షాపు ఓనరు యంగన్న శరీరం పూర్తిగా చితికిపోయి ఆ గది అంతా అలుముకుంది. ఈ బీభత్సానికి అంతా నివ్వెరపోయారు.

ఒక మూలకి ఉన్న గ్యాసు సిలిండర్ పేలిపోయింది. దూరంగా రిక్షాలో కూర్చున్న ఎర్రన్న ఆ శబ్దం విని అటువేపు పరిగెత్తాడు. ఆ హడావుడిలో ఎవరో అతన్ని గుద్దుకున్నారు. కిందపడ్డాడు. లేచి మళ్లీ షాపు వేపు పరిగెత్తాడు. బుజం కలుక్కుమంది. కాని ఆ క్షణంలో ఏమీ తెలియలేదు.

యంగన్న చావు వార్త వినగానే భార్య చంద్రమ్మ మధ్యాహ్నం ఆట సినిమా హాలు నుంచి హుటాహుటి రిక్షా చేయించుకువచ్చింది. చంద్రమ్మ గంభీరమయిన మనిషి. కర్ణాటకలో బాలెహొన్నూరు నుంచి యంగన్న తాడిపత్రిలో టైలర్‌గా పనిచేసే రోజుల్లో లేపుకొచ్చాడు. పాలిపోయినట్టున్న తెలుపు. కాస్త పళ్లెత్తు. పెళ్లికి ముందే మతం పుచ్చుకుంది. మొహానికి బొట్టులేదు. భర్తని చూసి కుప్పలాగ కూలిపోలేదు. అలా కూలిపోవలసి వస్తే రోజుకి 20 గంటలు తాగినప్పుడూ, జుత్తు పుచ్చుకుని యంగన్న తనని చావబాదినప్పుడు, ఆ గవర దానితో యవ్వారం జరిపినప్పుడు చాలాసార్లు కూలిపోయేది. అప్పుడూ తన కష్టం

పక్కవాళ్లకి తెలియనిచ్చేది కాదు. ఇప్పుడు ఆమె కనుకొనల్లో ఒక్క కన్నీరు బొట్టు కదలడం చుట్టుపక్కల వాళ్లు గమనించారు.

"చెయ్యాల్సిన తంతు చాలా ఉంది. మీ వాళ్ల నెవళ్లనయినా పిలిపించమంటావా?" అన్నాడు పక్క మరమరాల కొట్టు పోతరాజు.

"మా అన్న హరిరావు ఇక్కడే ఉన్నాడు".

బెంగుళూరు నుంచి 10 గంటల బస్సు ప్రయాణం బాలెహొన్నూరు. అంతదూరంలో ఉన్న హరిరావు నిజంగా ఈ సమయానికి ఇక్కడ ఉండడం అదృష్టం. పాపం, భర్త బతికినంత కాలం ఇల్లాలు కష్టాలు పడింది. పోయాక బుజం మీద చెయ్యేసి ఓదార్చే అన్న పక్కనే ఉన్నాడు – అనుకున్నారు అంతా.

ఎస్సై సీతయ్య నాయుడు బులెట్ దిగాడు. నాయుడికి ఏజెన్సీ ప్రాంతం నుంచి ఇటీవలే బదిలీ అయింది. ఫోన్ తనెత్తాడు కనుక వచ్చాడు కాని గ్యాస్ సిలిండర్ పేలిపోయిన కేసు చాలా సింపుల్ కేసు. చూసిన మొదటి మనిషి చేత ఎఫ్ఐఆర్ తీసుకుని వివరాలు బుక్కులో రాసుకుని కేసు క్లోజ్ చెయ్యడమే. అంతకంటే ఏమీ మిగలదు.

వచ్చాడు కనుక శవాన్ని చూశాడు. గది అంతా పరికించాడు. "రేపటిదాకా పోలీసు తంతంగం ఉంటుందేమో" అన్నాడు ప్లాస్టిక్ సామాన్ల కొట్టు యజమాని మోహన్‌లాల్.

"అక్కరలేదు. మధ్యాహ్నానికి ఎవరయినా స్టేషన్‌కి రండి. సర్టిఫికెట్ ఇచ్చేస్తాను" అన్నాడు నాయుడు.

"సాయంకాలానికి దహనం చేసుకోవచ్చు" అన్నాడు సీతయ్య నాయుడు.

మరో చిన్న సందేహం భాషాని లాగుతోంది.

"చిన్నమ్మగారికీ విషయం –" అక్కడున్న ఒకరిద్దరు తుళ్ళిపడ్డారు. అందరి దృష్టిలో సింహాచలం కదిలింది. అందరి నుదుళ్లూ ముడత పడ్డాయి. ఎవ్వరికీ సింహాచలం మీదా, యంగన్నకీ సింహాచలానికీ ఉన్న సంబంధం మీద సదభిప్రాయం లేదు.

అప్పుడయినా – బయటపడి సింహాచలాన్ని తిడుతుందేమోనని చంద్రమ్మ ముఖం చూశారు. ఆమె ముఖాన్ని గోడవేపు తిప్పుకుని – ఒక్క క్షణం ఆగి "అక్కర్లేదు" అంది.

ఇంతలో ఎక్కణ్నుంచి వచ్చిందో రాజ్యం భోరున ఏడుస్తూ వచ్చింది. "ఓరి నా తమ్ముడో – నీకెలాంటి చావొచ్చిందో" అని శోకాలు తీస్తూ. రాజ్యం ఆ పక్కనే చిన్న కంపెనీ నడుపుతోంది. ఆమె అండర్‌లో తెలిగ్గా ఎనిమిది తొమ్మిది మంది అమ్మాయిలున్నారు. కాని లెవెల్ 'సి' క్లాసు. షిప్పుల్లో దిగిన సైలర్లు, హార్బరు వర్కర్లు – ఈ లెవల్లో బిజినెస్ జరుపుతుంది. ప్రతినెల రోజులకీ శాల్తీల్ని మారుస్తుంది. ఆమె దగ్గర ఇటు పలాసా దగ్గర్నుంచి, అటు తణుకు దాకా సరికొత్త కేసులు దొరుకుతాయి. రాజ్యం డబ్బుని వడ్డీకి తిప్పుతాడు యంగన్న. యంగన్నంటే వల్లమాలిన అభిమానం రాజ్యంకి. యంగన్నకి

రాజ్యం అంటే ప్రాణం. పగలు తన కష్టం చెప్పుకోడానికి తోడబుట్టిన తమ్ముడులాగ యంగన్నని చూసుకుంటుంది. కంపెనీలో చిల్లర కుట్టుపనుల దగ్గర్నుంచి, చిన్న చిన్న పోలీసు కేసుల వరకు అన్నీ చక్కబెడతాడు యంగన్న.

గుండె పగిలేలా ఏడుస్తోంది రాజ్యం. చూసే వాళ్లకి కళ్లు చెమర్చేలాగ ఏడుస్తోంది. "నీ కెంత కష్టం వచ్చినాదే నా తల్లీ" అంటూ చంద్రమ్మని పట్టుకు ఏడ్చింది. ఎవరూ ఆమెని ఓదార్చాలని ప్రయత్నించలేదు. యంగన్నకీ రాజ్యానికీ ఉన్న బాంధవ్యం వాళ్లకి తెలుసు. చంద్రమ్మ భర్తపట్ల అపూర్వమయిన సహనాన్ని, సౌశీల్యాన్ని చూపితే, రాజ్యం తన తమ్ముడిపట్ల అరుదయిన అభిమానాన్ని, మమకారాన్ని చూపించింది. ఇప్పుడు రాజ్యం కావలించుకోగానే చంద్రమ్మకీ ఏడుపొచ్చింది, గొల్లుమంది.

"నా తమ్ముడ్ని మహారాజులాగ సాగనంపాలి. పూలపల్లకీ పెట్టిస్తాను. ఏర్పాట్లు కానివ్వండి. ఖర్చులు నావి" అంది రాజ్యం.

"ఎక్కువ టైం లేదు. హంగామా చెయ్యడానికి వేళ మించిపోతుంది. బ్యాండు వరకు ఫరవాలేదు" అన్నాడు మోహన్‌లాల్ – వాచీ చూసుకుంటూ.

రాజ్యం చర్రున లేచింది. "నీ అన్న కొడుకును అర్ధరాత్రి నిప్పెట్టినట్టునుకున్నావా శేర్ – ఆడు నా మారాజు. ఇయ్యాళ జరపడానికి టైం లేకపోతే రేపటి దాకా శవం ఉంటాది" అంది.

"అవును. రేపటి దాకా శవం ఉండాల్సిందే" అన్నాడు సీతయ్య నాయుడు. అందరూ ఒక్కక్షణం తుళ్లిపడ్డారు, యస్సై నోటి వెంట ఈ మాట వచ్చినందుకు. ఆయన యంగన్న మీద గౌరవంతో ఈ మాట అన్లేదని ఆయన ముఖం చూస్తే తెలుస్తోంది.

"బాడీని పోస్టుమార్టమ్‌కి పంపించాలి. రేపు సాయంకాలానికి కాని మీ కందదు" అన్నాడు నాయుడు. ఇంతలో నాయుడు తన నిర్ణయాన్ని ఎందుకు మార్చుకున్నాడు?

అందరూ ఆశ్చర్యంగా చూశారు. "ఎందుకూ? సిలెండర్ పేలిపోయి–"

"సిలెండర్ పేలిపోయి చచ్చిపోయిన మాట నిజమే. కాని సిలెండర్ పేలడానికి వెనక ఎవరిదో చెయ్యి ఉంది. ఇది హత్య"

అందరి మీదా పిడుగుపడ్డట్టయింది. సీతయ్య నాయుడు – సిలెండర్‌కి అతికించి ఉన్న రబ్బరుగొట్టాన్ని ఎత్తి చూపాడు "గొట్టాన్ని ఎవరో కత్తెరతో కత్తిరించారు. సిలెండర్‌లో గ్యాసు గదంతా వ్యాపించింది. యంగన్న బీడి వెలిగించే సరికి గదంతా భగ్గుమంది" అందరూ నిర్ఘాంతపోయి అటే చూస్తూ నిలబడిపోయారు – అచేతనంగా.

* * * * * *

టైలర్ యంగన్న మరణం చాలామందికి బాధ కలిగించినా, ఎవరికీ ఆశ్చర్యాన్ని కలిగించలేదు. యంగన్న చచ్చిపోవడానికి అన్ని అర్హతలూ ఉన్న వాడు – రోజులో 20 గంటలు తాగుతాడు, చక్కెర జబ్బు ఉంది, బ్లడ్‌ప్రెషర్ ఉంది. మనిషి ఎముకల గూడులాగ

ఉంటాడు. మందు దిగిన నాలుగు గంటలూ మేలుకొని ఉంటే పుల్లలా వణుకుతాడు. ఆ వణుకు తగ్గాలంటే తాగాలి. తాగాక అతని కత్తెర బట్ట మీద వీరవిహారం చేస్తుంది. ఆలశ్యమయినా అతని బ్లౌజు కొట్టొచ్చినట్టు తెలుస్తుంది. అమ్మాయి వయస్సుని కనీసం అయిదేళ్లు తగ్గిస్తుంది.

అయితే యంగన్న హత్య ఎవరూ ఊహించలేనిది. షాపులో ఖరీదయిన సామాన్లేవీ లేవు – ఖాళీ రమ్ము సీసాలు, కుట్టాల్సిన బట్టలూ తప్ప. మరి అతన్ని చంపి సాధించాలనుకున్నది ఏమిటి? ఎవరికి ఆ అవసరం ఉంది?

యంగన్న వ్యాపారం పెద్దదయినా షాపు పెద్దది చెయ్యలేదు. ముందు చిన్న చూరు దింపిన వసారా వీధిలోకి తొంగి చూస్తుంటుంది. వెనక చిన్న గది. ఆ గదినిండా బట్టలూ, హేంగర్లు పదయినా పరిచి ఉంటాయి. యంగన్న ఉదయం వస్తే రాత్రి వరకు ఇల్లు చేరడు. ఇల్లు అల్లిపురంలో. మధ్యాహ్నం భోజనాన్ని భాషా తీసుకొస్తాడు. సాయంకాలం చీకటి పడ్డాక సింహాచలం వస్తుంది. రాత్రి పని అయేదాకా అతనితో ఉండి కుట్టిన బట్టలన్నిటికీ ఎంత రావాలో లెక్కలు రాసి – యంగన్న మందు తాగేదాకా ఉండి – డబ్బు బాగా చేతిలో తిరిగితే కోడి కోసి దుకాణంలోనే కూర చేస్తుంది. ఇద్దరూ కలిసి ఆమె ఇంటికి వెళతారు. రాత్రి ఎర్రన్న చంద్రమ్మ ఇంటికి యంగన్నని దింపుతాడు. గాసు పొయ్యిని ఈ మధ్యనే కొనిపెట్టాడు యంగన్న. మధ్యలో టీ కలుపుకోవడానికీ, రాత్రి వంటకీ సౌకర్యంగా ఉంటుందని.

సింహాచలం గుమ్మటంలాంటి మనిషి – యంగన్నంటే వల్లమాలిన ప్రేమ. ఓసారి బిగు[illegible]యిన పాత జాకెట్టును సరిచేయించుకోడానికి వచ్చిన మనిషి – ఆ రోజుల్లోనే యంగన్నంటే మోజుపడి అతనితోనే ఉండిపోయింది. పోర్టులో పనిచేసే నూకరాజు ఆమెకి వరసకి అన్న. సింహాచలం యంగన్నని పట్టుకు వేలాడడం సుతారమూ నచ్చని మనిషి. ఎప్పుడూ యంగన్నతో తగాదా పడుతూంటాడు. ఎన్నోసార్లో తాగి ఇద్దరూ చేతులు కలపగా విడదీసింది సింహాచలం. నూకరాజు ద్వారానే గాసు పొయ్యి, సిలెండర్ సింహాచలం తెప్పించింది. యంగన్నని కలిసినప్పుడల్లా నూకరాజు బూతులు తిట్టడానికి చాలామంది సాక్షులున్నారు. మొదటి అనుమానం నూకరాజు మీదే వచ్చింది సీతయ్యానాయుడికి. వాకబు చెయ్యగా సింహాచలానికి పన్నెండు తులాల బంగారు నాను, పద్దెనిమిది వేల రూపాయల ఫిక్సెడ్ డిపాజిట్ ఉన్నాయని తేలింది. సింహాచలం యంగన్న ఆధీనంలో ఉండడం వల్ల నూకరాజుకి వచ్చిన నష్టం ఏమిటి? కనుక్కోవాలనుకున్నాడు.

ఎలిఫెంట్ బార్‌లో ఓ మూల ఒంటరిగా మందు కొడుతూ కనిపించాడు నూకరాజు. చాలా బలిష్టమయిన శాల్తీ. యంగన్న పోయిన వార్త ఆ మధ్యాహ్నమే తెలిసింది. చాలా ఆనందించాడు నూకరాజు.

"ఆ నా కొడుకు శని మా చెల్లాయికీ ఇవాల్టితో వదిలిపోయింది – చేతనయితే నేనే వదల కొట్టేవాడిని" అన్నాడు పళ్లు నూరుతూ.

"యంగన్న వల్ల నీ కొచ్చిన నష్టం ఏమిటి?"

"నాకు కాదు సార్. వాడిని నమ్ముకుని పది పన్నెండు సంవత్సరాలుగా బతుకుతోందా? తన డబ్బు ఖర్చుపెట్టి వాడిని మేపుతోందా? రోజూ దాని సొమ్ము తిని దాన్ని చావగొడతాడు సార్. సిగరెట్టుతో తొడల మీద, మెడమీదా కాలుస్తాడు. జుత్తు పట్టుకు ఈడుస్తాడు."

"నువ్వాపాలని ప్రయత్నించలేదా?"

"సార్, నా మనిషి నా మాట వింటే ఏనాడో దానికి చక్కగా పెళ్లి చేసేవాడిని సార్. వాడంటే మా చెల్లాయికి పిచ్చి. ఎంత చావగొట్టినా వాడు దేవుడంటుంది."

తను పోలీసాఫీసరని తెలిసి కూడా అంత స్పష్టంగా తన కోపాన్నీ, యంగన్న పట్ల ద్వేషాన్నీ ప్రకటించే నూకరాజులో నిజాయితీ కొట్టవచ్చినట్టు కనిపించింది. ఇలాంటి మనుషులు చేసేది నేరం అనుకుంటూ చెయ్యరు. బాహాటంగా చేస్తారు.

"ఏమిటి సార్ ఆలోచిస్తున్నారు. ఆ యంగన్నని నేను చంపాననా? వెధవ నా కొడుకు ఇంతు సుళువుగా చచ్చిపోతాడని తెలిస్తే ఆ రోజు ఆ సిలెండర్ రబ్బరు ట్యూబు నేనే కత్తిరించేవాడిని" అన్నాడు నాలుగో పెగ్గు తాగుతూ.

సీతయ్య నాయుడు నవ్వుతూ లేచాడు. "నువ్వా పని చేయలేవు బ్రదర్ – చెల్లెల్ని చావగొట్టిన మనిషిని పదేళ్లు భరించినవాడు హఠాత్తుగా హత్యకి – నో –" బయటికొచ్చి మోటారు సైకిలు స్టార్ట్ చేశాడు.

* * * * *

మర్నాడు ఆఫీసుకొచ్చినప్పుడు కేసు దర్యాప్తులో ఉన్న రంగయ్య చెప్పాడు. "మీకు తెలుసా సార్ – యంగన్న స్నేహితుడు కనకయ్య నిన్న సాయంత్రం నుంచీ కనిపించడం లేదట."

"కనకయ్య ఎవడు?"

"బంగారపు పని చేస్తాడు. యంగన్న ఫ్రెండు. ఇద్దరూ కలిసి కొట్టు వెనక గదిలో తాగుతూంటారు."

నాయుడికి కాస్త ఆశ్చర్యం కలిగింది. కనకయ్యకీ హత్యతో ఏం సంబంధం?

"తమతో మాట్లాడాలని బయట ఎవరో మనిషి నిలబడ్డాడు సార్" అన్నాడు డ్యూటీ కానిస్టేబులు.

రిక్షా ఎర్రన్న లోపలికొచ్చాడు. "సార్ నిన్న ఇంటికెళ్లాక ఈ భుజం నొప్పి ఎక్కువయింది. అప్పుడు యిసయం గుర్తొచ్చింది. మీకు చెప్పాలని వచ్చాను."

"ఏమిటది"

"యంగన్న దుకాణంలో సిలెండర్ పేలినప్పుడు అంతా దుకాణం వేపు పరిగెత్తామా? ఒక్కడే దుకాణం నుంచి పారిపోయాడు సార్"

సీతయ్య కుర్చీలో ముందుకు జరిగాడు.

"నీకెలా తెలుసు"

"నన్ను గుద్దుకున్నాడు సార్. అప్పుడు తెలియలేదు. ఇంటికెళ్లాక ఈ భుజం నొప్పి ఎక్కువయితే గుర్తొచ్చింది."

"ఎవరు గుద్దుకున్నారో గుర్తుందా"

"ఉంది సార్. బాగా గుర్తుంది. ఆడు యంగన్న దోస్తే – కనకయ్య బాబూ"

రంగయ్య, సీతయ్య ముఖాముఖాలు చూసుకున్నారు. వెంటనే కనకయ్యని వెదికి పట్టుకోవలసిందిగా సీతయ్యనాయుడు ఫోన్లు చేసేశాడు.

పోస్టుమార్టంలో ప్రత్యేకంగా తేలిందేమీ లేదు. సిలెండర్ పేలుడుకి నిస్సందేహంగా యంగన్న చచ్చిపోయాడు. శవాన్ని రాజ్యం దగ్గరుండి ఘనంగా పూరేగింపు చేయించి అంత్యక్రియలు చేయించింది. స్మశానానికి ఇద్దరే ఆడవాళ్ళు వచ్చారు. ఒకరు రాజ్యం, దూరంగా గేటు దగ్గర ఒంటరిగా నిలబడిన సింహాచలం. సింహాచలాన్ని అప్పుడే చూశాడు సీతయ్యనాయుడు. విగ్రహం భారీ అయినా మనిషి మరీ బిగువుగా కనిపించింది. కళ్లు ఎర్రగా ఉన్నాయి.

దగ్గరికి వచ్చాడు. "నిన్న భోజనం టైముకి కొట్టుకి రాలేదేం?" అన్నాడు పక్కకి వచ్చి.

సీతయ్యని చూసి కంగారు పడింది. తనని పరిచయం చేసుకున్నాడు. "అప్పటికి పోయాడని కబురు తెలిసింది. నేను వస్తే అల్లరవుతుంది. నాక్కావలసిన మనిషి పోయాడు. నా కన్నీరు ఎక్కడ కార్చినా ఒకటే".

"యంగన్న నిన్ను కొట్టేవాడట."

ఆమె కళ్లల్లో కోపం కనిపించింది. "ఆ వెధవ చెప్పాడా"

"నిజం కాదా"

"మళ్లీ జన్మంటూ ఉంటే ఆ మనిషికే ఇల్లాలి నవుతాను" అంది యంగన్న శరీరం కాలుతున్న మంటలవేపు చూస్తూ. "ఎన్ని కష్టాలు! మరిచిపోడానికి తాగేవాడు. నన్ను కొట్టినందుకు కాదు, అతని కోపం తీరినందుకు నాకానందంగా ఉండేది – రబ్బరు ట్యూబు తనే కోసుకున్నా ఆశ్చర్యం లేదు"

నాయుడు గతుక్కుమన్నాడు "యంగన్నకి ఆత్మహత్య చేసుకోవలసినన్ని కష్టాలున్నాయా?"

సింహాచలం కళ్లు తుడుచుకొని "కొందరి కష్టాలు చెప్తే అర్థమయేవి కాదు. ఆ జన్మకి తీరేవి కావు. చచ్చిపోయి సుఖపడిపోయాడు మారాజు" అంది.

అతన్ని 'మారాజు' అని పొగిడిన ఇద్దరు ఆడవాళ్లు అక్కడ ఆ స్మశానం దగ్గరే ఉన్నారు.

సీతయ్య మోటారు సైకిలు స్టార్టు చేశాడు.

* * * * *

అనకాపల్లిలో ఓ చిన్న లాడ్జిలో కనకయ్య ఉన్నాడని కబురు తెలిసింది. ఎందుకయినా మంచిదని, అరెస్టు వారెంటు వ్రాయించుకుని హుటాహుటిన బయలుదేరాడు నాయుడు. కాని ఎక్కడో చిన్న లోపం మనస్సులో కదులుతోంది. ఈ కనకయ్య తను ఎదురు చూసే మనిషి కాదని ఏదో అనుమానం.

"యంగన్న శవాన్ని ముందుగా చూసింది – నువ్వేనా?"

"అవును"

"చూడగానే పారిపోయావేం?"

"పారిపోయానా? ఎవరన్నారు?"

"మరెక్కడికి వెళ్లావు?"

"సింహాచలానికి చెప్పడానికి. ఈ ఘోరం జరిగిన హడావుడిలో సింహాచలానికి ఎవరూ చెప్పరని నాకు తెలుసు. ఈవార్త తెలియాల్సిన మనిషి ఆమే".

"మరి దొంగతనంగా ఈ హోటల్లో ఉన్నావే?"

"యంగన్న బతికుంటే యివాళ అతని పుట్టిన రోజు సార్. ఇద్దరం కలిసి పండగ చేసుకునే వాళ్లం – సింహాచలం ఇద్దరికీ విందు చేయాలని పది రోజుల బట్టీ ప్రయత్నాలు చేస్తోంది. నిన్ననే అమలాపురం నుంచి పూతరేకులు తెప్పించింది. ఇవాళ బతికుంటే యంగన్న సింహాచలానికి ఉంగరం తొడిగేవాడు. నేనే స్వయంగా చేశాను. అవును సార్. నా ప్రాణమిత్రుడు చచ్చిపోయిన బాధని తట్టుకోలేక – అతని పుట్టిన రోజుని ఒక్కడినీ జరుపుకొంటున్నాను"

జేబులో పెట్టుకు వచ్చిన అరెస్టు వారెంటుని ఒక్కసారి తడువుకొని బయటికి నడిచాడు నాయుడు. ఉంగరం! ఏదో పజిలు విడిపోయినట్టనిపించింది. ఎక్కడ చూశాడు కొత్త ఉంగరం? –

* * * *

స్టేషన్‌కి రాగానే రంగయ్య చెప్పాడు చంద్రమ్మ అన్న హరిరావు వచ్చి కంప్లయింటు యిచ్చి వెళ్ళాడని. తీసి చదివాడు. తన బావగారి ఆస్తులయిన డయొనారా టి.వి., సుమిత్ మిక్సీ, నేషనల్ టూయిన్ వన్ టేపురికార్డరు, 4 పట్టు చీరెలు సింహాచలం దగ్గర ఉన్నాయి. కనుక వాటిని వెంటనే తమకు స్వాధీనం చేసే ఏర్పాటు చెయ్యమని.

"దీని కోసం మనకి కంప్లయింటు ఎందుకు? సింహాచలాన్నే స్వయంగా వెళ్ళి అడగొచ్చుగా?"

"ఆ మాటే సింహాచలం అంది సార్. ఆయనే పోయాక ఈ వస్తువులన్నీ ఎందుకు నాకు అంటూ అన్నిటినీ హాండోవర్ చేసింది సార్–" అన్నాడు రంగయ్య టేబిలు మీద ఆ వస్తువుల్ని ఉంచుతూ.

"ఉంగరం – ఉంగరం ఎక్కడ?"

"ఉంగరమా సార్!"

"అదే – అతని పుట్టిన రోజుకి – ఆమె కిచ్చిన –"

ఆగిపోయాడు నాయుడు.

పుట్టిన రోజు జరుగలేదు కదా! మరి?

చటుక్కున లేచాడు.

* * * * *

టైలర్ షాపులో పనిచేసే భాషా షాపు దగ్గరే దొరికాడు.

నాయుడుని చూసి కంగారు పడ్డాడు భాషా. భుజం తట్టి మోటార్ సైకిల్ ఎక్కించుకుని హోటలుకి తీసుకొచ్చాడు.

"ఎన్నేళ్ళ బట్టీ యంగన్న షాపులో పనిచేస్తున్నావు?"

"నాలుగేళ్ళు"

"యంగన్న ఎలాంటి వాడు?"

"దేవుడు సార్"

"రోజూ భోజనం కేరేజి ఎవరు తెస్తారు?"

"నేనే సార్"

"యంగన్న పోయిన రోజు తీసుకొచ్చావా?"

"లేదు సార్"

"ఎందుకని?"

"తీసుకు రావడానికి ఇంటికి వెళ్ళాను సార్. అయ్యగారు యింటికే వస్తారు అని చంద్రమ్మగారు చెప్పారు సార్"

"అప్పుడు యింట్లో ఎవరున్నారు."

"చంద్రమ్మగారు, హరిరావుగారు"

"సినిమాకి వెళ్తున్నామని నీతో చెప్పారా?"

"లేదు సార్. పూర్ణా టాకీసులో ఏం సినిమానో హరిరావు అడిగారు సార్"

నాయుడు లేచాడు. మళ్ళీ అతన్ని దింపేస్తూ – మోటారు సైకిల్ ఎక్కి –

"సరికొత్త బంగారపు ఉంగరాన్ని ఎక్కడయినా చూశావా?"

భాషా ఆశ్చర్యపోయాడు. "లేదు సార్"

సీతయ్యనాయుడు నుదురు ముడతలు పడింది. ఇంకా ఏదో విషయం తేలడం లేదు.

సరాసరి కనకయ్య దగ్గరికి వచ్చాడు. "యంగన్న శవాన్ని చూశాక షాపులోకి పరిగెత్తి వెళ్తూ ఎవరికయినా గుద్దుకున్నావా?"

కనకయ్య ఆశ్చర్యపోయాడు. "నేను పరిగెత్తలేదు సార్. ఎందుకూ పరిగెత్తడం?"

సీతయ్యలో యింకా అనుమానం తీరలేదు.

రిక్షా ఎర్రన్నకోసం వెదికాడు – సాయంకాలం ఏడు గంటలకు దొరికాడు. "నిన్ను ఎవరో గుద్దుకున్నారన్నావు?"

"కనకయ్య బాబూ"

"ఎలా అంత రూఢిగా చెప్పగలవు?"

"ఆ లంజకొడుకే బాబూ మా యంగన్న బాబుని చంపింది. మరెవరికయినా పరిగెత్తి పారిపోవలసిన అవసరం ఏటుంటాది బాబూ"

"నువ్వెంత వరకూ చదివావు"

"రెండో క్లాసు బాబూ"

దూరంగా సినిమా పోస్టరుని చూపించి "ఆ పోస్టరు మీద నటుడెవరో చెప్పగలవా?"

"అదేటి బాబూ అక్కినేని బాబు కదా?"

సీతయ్య నాయుడులో అనుమానం తీరిపోయింది. పోస్టరులోంచి తొంగి చూస్తున్న శోభన్‌బాబుని చూసి చిరునవ్వు నవ్వుకొని మోటార్ సైకిలు ఎక్కాడు.

స్టేషన్‌కి వచ్చేసరికి భాషా ఎదురు చూస్తున్నాడు –

"తమరు కొత్త ఉంగరం గురించి అడిగారు కదా సార్"

"అవును"

"ఇప్పుడు గుర్తొచ్చింది చూశాను సార్"

"ఎవరి దగ్గర?"

పేరు చెప్పాడు. సీతయ్య నాయుడు తృప్తిగా నిట్టూర్చాడు. తన మనసులో అనుమానం తీరిపోయింది.

మరునాడు సాయంకాలం బాలెహొన్నూరు వెళ్తున్న బస్సులోంచి బేలూరు దగ్గర హరిరావును కర్ణాటక పోలీసులు దించేశారు. యంగన్నను హత్య చేసిన నేరం కింద కస్టడీలోకి తీసుకున్నారు.

పూర్ణా టాకీసులో రెండోసారి – యంగన్న పోయిన రోజు సినిమా మళ్లీ చూస్తున్న చంద్రమ్మని సీతయ్యనాయుడు అరెస్టు చేశాడు.

* * * * *

తీరిగ్గా చుట్ట వెలిగించుకొని కథలాగా చెప్పుకపోయాడు నాయుడు రంగయ్యతో.

ఇద్దరి పెళ్లాల మొగుడు ఎప్పుడూ అడకత్తెరలో పోకచెక్కయినట్టే – అందులో ఒకరు పెళ్ళాం కాదు, కనక పెళ్ళి చేసుకున్న ఆడదానికి మొగుడి మీద ఎక్కువ హక్కులుంటాయి. సాధించి, బాధపెట్టే మొగుడు తనకి దూరమవుతున్నాడంటే – ఎన్నో త్యాగాలు చేసి దక్కించుకున్నట్టు ఆ భర్త మీద ఎక్కువ హక్కు, దూరమయినందుకు ఎక్కువ బాధ సహజం. మొదట్నుంచీ ఈ కేసులో చంద్రమ్మ, సింహాచలమే నన్ను ఆకర్షిస్తూ వచ్చారు. ఈ ఇద్దరిలో ఎవరో ఒకరి చుట్టూ ఈ హత్యా నేరం ఉండి ఉంటుందని. ఎందుకనో మొదట్నుంచీ సింహాచలాన్ని ఎక్కువ అనుమానించాను. కాని ఎక్కడో

పప్పులో కాలేస్తున్నాని అనుమానం లాగుతూనే ఉంది. చివరికి ఉంగరం నా సమస్య పరిష్కరించింది.

"ఎలాసార్?"

యంగన్న పుట్టిన రోజు ఆయన పోయిన రెండో రోజు. పుట్టిన రోజుకి పూతరేకులు పురమాయించింది సింహాచలం. అమలాపురం నుంచి కనకయ్య తెచ్చాడు. ఉంగరం పురమాయించాడు యంగన్న. ఆ ఉంగరం సింహాచలానికి చేరలేదు. కారణం? పుట్టిన రోజు జరగలేదు.

"రోజూ కేరేజీ పంపే చంద్రమ్మ – యంగన్న పోయిన రోజు కేరేజీ పంపలేదు. ఎందుకు? కేరేజీ అవసరం ఆ రోజు లేదు – ఆవిడకి – ఆవిడ ఒక్కరికే – పొరపాటు, – ఆవిడకీ హత్య చేసిన మనిషికీ తెలుసు. సింహాచలానికి చేరాల్సిన ఉంగరం సంగతి చంద్రమ్మకి తెలిసే ఉంటుంది. అది కూడా ఆమె కసిని పెంచడానికి ఒక కారణం కావచ్చు. ఆ ఉంగరం యింట్లోనే ఉండి పోయింది. ఆ ఉంగరాన్ని భాషా చూశాడు. ఎవరి దగ్గర? హరిరావు దగ్గర. ఎక్కడ చూశాడు? చెప్పలేక పోయాడు.

నిజానికి భాషా హరిరావుని సిలెండర్ పేలిన మరుక్షణం షాపుదగ్గరే చూశాడు. ఆ క్షణంలో ఉంగరం మనసులో మెరిసింది. మరి ఎర్రన్న గుద్దుకొన్నది? కనకయ్యని కాదు. హరిరావుని. ఎర్రన్నకి దృష్టి సరిగ్గా ఆనదు. అతను సిలెండర్ ప్రేలిన కంగారులో ఉన్నాడు. తప్పనిసరిగా కనకయ్యే అనుకోవడానికి కారణం హరిరావు, కనకయ్య ఒకే పొడుగు, ఒకే రకమైన ఆకారం. కాగా, కనకయ్య వల్లే తను బాగా అభిమానించే యంగన్న చెడిపోతున్నాడనే విష్‌ఫుల్ థింకింగ్ అతని చేత ఆ పొరపాటు చేయించింది. కాని కనకయ్య కూడా అప్పుడు అక్కడే ఉన్నాడు. అయితే పరిగెత్తింది హరిరావు. ఎక్కడికి? పూర్ణా థియేటర్‌కి. ఎందుకు? తాము అనుకున్న పని జరిగిందని చంద్రమ్మకి చెప్పడానికి. ఒక్క విషయం ఎవరూ అనుకోలేదు. యంగన్న పోయినట్టు చంద్రమ్మకి ఎవరూ వెళ్ళి చెప్పలేదు. అయినా వచ్చింది. అంటే – హరిరావు టైలర్ షాపు నుంచి ఆమె దగ్గరికి వెళ్ళి ఉండాలి. అనుకొన్న పని అన్నయ్య సాధించినందుకు – కాదు – చెయ్యబోతున్నందుకు – ఉంగరాన్ని యిచ్చింది. కాస్త ముందుగానే చేతికి పెట్టుకున్నాడు హరిరావు. సిలెండర్ ట్యూబ్ కోసే టైముకి యింకా యంగన్న చచ్చిపోలేదు, కాని సింహాచలానికి చేరాల్సిన ఉంగరం హరిరావు చేతికి ఉంది!"

సీతయ్య నాయుడు తాపీగా చుట్ట వెలిగించాడు.

"ఆరెస్టు టైముకి చంద్రమ్మ మళ్ళీ చూసిన సినిమాయే పూర్ణా టాకీసులో చూస్తోందేంసార్?" అన్నాడు రంగన్న.

నాయుడు నవ్వి "మొదటి సారి ఆమె దృష్టి సినిమా మీద లేదు. జరగాల్సిన హత్య మీద ఉంది. రెండో సారే తృప్తిగా, మనశ్శాంతిగా సినిమా చూస్తోంది" – కుర్చీ లోంచి లేచి "ఏమయినా ఉంపుడు కత్తె ప్రేమ కన్నా భార్య పొజెసివ్‌నెస్ చాలా ప్రమాదమయ్యా" అంటూ మోటారు సైకిలు స్టార్టు చేశాడు.

– *(21-6-1991 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక)*